

# పట్నం పోదాం...బార్‌ని చూద్దాం...ఛలో ఛలో!

**జి.శ్రీదేవి**

(గత సంచిక తరువాయి)

రెండు సంవత్సరాలకు పూర్వం టెన్త్‌క్లాస్ ఎగ్జామ్స్ వ్రాసి వేసవి సెలవులకు ఎప్పటిలా క్రికెట్ బ్యాట్‌తో వచ్చిన వర్ధన్ ఆటాపాటలతో పొలం పుట్ర తిరుగుతూ కాలం గడుపుతున్నాడు. ఓ రోజు ఉదయం పొలం అని చెప్పి బయటకు వెళ్ళిన వర్ధన్ మధ్యాహ్నం భోజనం టైం అయినా ఇంటికి చేరలేదు. వస్తాడని ఎదురుచూసినా ఎల్లమ్మ అలా చూస్తూనే సాయంత్రం నాలుగైపోయింది. అయినా ఫరవాలేదు. వీధిలో ఎదురుచూస్తూనే కాలు, చేయి ఆడక వెళ్ళే, పోయే ప్రతి ఒక్కరినీ అడిగింది. ఏ ఒక్కరినుండీ సరైన సమాధానం రాలేదు.

"ఒరేయ్, సింహాద్రి మా పెద్దాయనగారిని గాని పొలంలో చూశావా? పొద్దుననగా వెళ్ళాడు. ఎక్కడికి వెళ్ళాడో ఏమో, నీకు కనిపించాడా?"

"చూడలేదు" అని అర్థోలా ముఖం ప్రక్కకు పెట్టుకుని వెళ్ళిపోయాడు తన పొలం పై పొలం సాగుచేసుకునే సింహాద్రి.

"చెల్లాయమ్మా, మా పెద్దాయన్ని గాని చూశావా?"

"ఏమోనత్తా సరిగా చూడలేదు." అని చెప్పి తమ పొలం ప్రక్క పొలం తిరుపతయ్య పెళ్ళాం చెల్లాయమ్మ వెళ్ళిపోయింది. అలా నలుగురైదుగురి నుండి అదే సమాధానం వచ్చింది. ఆ సమాధానం వెనుక తెలిసి కూడా చెప్పలేని భావం ఉంది. కాని అది ఆమె గుర్తించలేదు.

"ఒసేయ్ రామన్న ఊళ్ళో ఎక్కడన్నా మా పెద్దాయన కనిపించాడా?" అని అడిగింది వర్ధన్ ఈడు వాడే యైనా రామన్నను అటుగా రావడం చూసి.

"లేదవ్వా నేను వాడికోసమే చూస్తున్నాను. సాయంత్రం ఆడుకుందాం అన్నాడు. అయితే ఇంట్లో లేడా?"

"లేదురా, ఎక్కడికెళ్ళాడో ఏమో. ఊళ్ళోను లేక పొలంలోనూ లేక ఎక్కడికెళ్ళినట్లో. ఎక్కడైనా కనిపిస్తే నేను కంగారుపడుతున్నానని చెప్పు."

వచ్చేపోయేవారిని అడుగుతూ ఉండగా పడమటిన సూర్యుడు క్రుంగిపోతున్నాడు. పొలం వెళ్ళిచూడాలనే ఆలోచన వచ్చినా అప్పటికే ఆలస్యం అవడంతో మరో దారి నుండి వస్తాడేమో అన్నం పెట్టాలి అనుకుంటూనే ఆత్రమయ్యింది. అడిగిన వారినే అడగడంతో చివరకు సాయంత్రం పొలం నుండి అదే దారిన తిరుగుముఖం పట్టిన సింహాద్రిని తిరిగి మళ్ళీ అడిగితే సమాధానం దొరికింది.

"మీ పెద్దాయన ప్రకాశరావు మామ సమాధిమీద పొలంలో నిద్రోతున్నాడు." అని చెప్పి అక్కడ నిలబడకుండా వెళ్లిపోయాడు వివరణ ఏమైనా ఇవ్వవలసివస్తుందేమోననే ఉద్దేశ్యంతో. ఆ మాట చెవిన పడటమే గుండె జల్లుమంది. ఇంటి తలుపైనా వేయకుండా వీధిలో నుండే పొలం దారిపట్టింది. జ్వరం ఏమైనా వచ్చిందేమో! పురుగు, పుట్ర ఏమైనా కుట్టిందేమో! రకరకాల ఆలోచనలతో భర్త సమాధి దగ్గర స్పృహ లేకుండా పడున్న వర్ధన్‌ని చూసి వళ్ళంతా తడిమి చూసింది. శరీరం చల్లగానే అనిపించింది. మనిషి మాత్రం స్పర్శ తగిలినా కదలికలేదు. ఆ పరిస్థితులు చూసిన తరువాత ఏదో అవగతమైనట్లు మౌనంగా లేచే వరకు కూర్చుండిపోయి లేచిన తరువాత ఏం మాట్లాడకుండా ఇంటికి తీసుకొచ్చింది. ఆ రాత్రి భోజనం చేసి తిరిగి పడుకున్నాడు. ఉదయాన్నే లేచి బ్యాట్ పట్టుకుని ఎప్పటిలా వీధిలోనికి బయలుదేరుతుంటే అతనితో మాట్లాడేందుకే అన్నట్లు టెక్కిమీద వేచియున్న ఎల్లమ్మ ఆగమన్నట్లు - "పెద్దాయన" అని పిలిచింది.

"అరే! ఇక్కడున్నావా? ఇంట్లో ఎక్కడా కనిపించకపోతే పొలం ఏదైనా వెళ్ళావేమో అనుకున్నాను. ఏమిటి నాయనమ్మా...?" అంటూ తిరిగి దగ్గరకు వచ్చాడు. అప్పటికే నాలుగడుగులు బయటకు పడిపోవడంతో, మామూలుగా ఎప్పటి వర్ధన్ వలె.


"ఈమధ్య పొలం వెళ్లినప్పుడల్లా కల్లుతాగుతున్నావా? నిన్న కొద్దిగా ఎక్కువ తాగినట్లు కూడా ఉన్నావు?" ఏమిటి సమాధానం అన్నట్లు నిలదీసింది.

"తప్పా!?" అంటూ అదోలా చూశాడు. అందులో ఆమె జవాబు చెప్పలేని భావం స్పష్టంగా కనిపించింది. అది ఆమె గ్రహించింది - "తాగుతున్నాను! అది తప్పైతే తీయడమెందుకూ మన పొలంలోనే సుమారు వంద చెట్లకు తీయించుకున్నాము. మన పొలంలోనిది మనమే తాగకూడదనుకుంటే ఎదుటివారు మాత్రం ఎందుకు తాగాలి? అది తప్పుకదా? త్రాగడానికి విషం కాదుగా! గేదె పాలు త్రాగుతున్నాము. కోడిని చంపి చికెన్ అని తింటున్నాము. మేకను కోసి మటన్ అని తింటున్నాము. అలాంటప్పుడు ఓ చెట్టునుండి వచ్చే కల్లు తాగితే తప్పేమిటి? అది తప్పే యైతే మనం చేయటమెందుకూ?"

అది తప్పైతే మనం చేయటమెందుకూ? అది తప్పైతే మనం చేయటమెందుకూ? అది తప్పైతే మనం చేయటమెందుకూ??? చూపుల్లోని భావం చెవులలో ప్రతిధ్వనించింది. వర్ధన్ భావం గ్రహించి బదులివ్వలేకపోయింది. అందులో ఎంతో

సత్యముంది. పెద్దలు ఏది చేస్తే పిల్లలు అదే నేర్చుకుంటారు. ఏదైనా ఎదుటి మనిషినుండే ఎంతో కొంత నేర్చుకునేదే కాని ఎవరికి వారు చేయరు. తప్పు అనుకున్నది పెద్దలైనా చేయకూడదు. తప్పు అనేదానికి పెద్ద, చిన్న తారతమ్యం లేదు. ఎవరు చేసినా తప్పు తప్పే! నిజం చెప్పాలంటే పెద్దవాళ్ళు చేస్తే అది అసలు పెద్ద తప్పు!!

నాలుగు గోడల మధ్య గోప్యంగా పెరిగిన గౌతమబుద్ధుడు దాటిన మరుక్షణం సమాజంలో సత్యాన్ని గ్రహించి సన్యాసం పుచ్చుకున్నాడు.



వర్ధన్
మనస్తత్వం - స్వేచ్ఛ విఫణిలో
ఉన్నదానిని అనుభవించడంలో తప్పేముంది?

వర్ధన్‌కు సమాధానం చెప్పలేని ఎల్లమ్మ ఆ మరుక్షణం తన తాటి చెట్ల నుండి కల్లు తీయించడం నిలుపుచేసింది. ప్రస్తుతం అదే అతనికి సమాధానం అనుకుంది.

వర్ధన్ నిర్ణయం విన్న తరువాత వర్ధన్‌ని తక్షణం తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి అనే నిర్ణయానికొచ్చేసింది. దాంతో ఇరవైనాలుగు గంటలు తిరగకుండానే పొలము, పుట్ర అన్నీ అయినవారి సంరక్షణలో పురమాయించి వర్ధన్‌కు తిరిగి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా తల్లిదండ్రులకు వ్రాసిన లెటరుకంటే ముందే పట్నం చేరారు.

వర్ధన్ రాకతో చలపతిరావు, ప్రభావతిలు తెగ సంబరపడిపోయారు. ఊహించని విధంగా అతనితోపాటు ఎల్లమ్మ రావడం కూడా వారిలో సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తింది. వర్ధన్ రావడమే ఒక దాని వెనుక ఒకటి ఏర్పాటు చేశారు. మోటారుబైక్ కొన్నారు. కోచింగ్ సెంటరులో జాయిన్ చేశారు. రడీమేడ్ షాపును ఇంట్లో పెట్టినట్లు వెరైటీ డ్రస్సులతో అతనికి కేటాయించిన రూమ్ లోని బీరువా నింపారు. వారుండే అపార్టుమెంటు మొత్తానికి అందంలోనూ, చదువు, సంధ్యలోనూ తమ కుమారుడే మిన్న అనే గర్వం చేరి ఎలాంటి లోటు లేనివిధంగా ప్రతిది గుర్తు తెచ్చుకుని మరీ సమకూర్చారు. కాలచక్రం గిర్రున తిరుగుతూ ఎంసెట్‌లో ర్యాంకు సాధించిన వర్ధన్ కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో జాయిన్ అయ్యాడు. వర్ధన్‌కు ఫ్రెండ్స్ సర్కిల్ కూడా బాగా పెరిగింది. ఇంట్లో ఉన్నంత సేపు ఎవరో ఒకరు రావడం ఫోన్స్ చేయడమో నిర్విరామంగా కొనసాగుతుంది.

చలపతిరావు, ప్రభావతిలు ఉద్యోగ నిర్వహణలో బిజీగా ఉండటంతో ఇంటి వ్యవహారాలు మొత్తం ఎల్లమ్మకు అప్పగించేశారు.

ఎల్లమ్మ పట్నం ఏ ఉద్దేశ్యంతోనైతే వచ్చిందో అందులో సఫలీకృతం అయినట్లే సంతృప్తి చెందింది. వర్ధన్ దినదిన ప్రవర్ధమానంగా, పున్నమి చంద్రుడిలా ప్రకాశించడంతో, పున్నమి చంద్రుడికి సైతం గ్రహణం పట్టక మానదని గుర్తించలేదు. ఇంట్లో ప్రవేశించిన మొదట్లో ఇంటి వాతావరణాన్ని కొడుకు, కోడలిని అబ్జర్వ్ చేసింది. ఏ ఒక్కరి వల్ల వర్ధన్ భవిష్యత్‌కి ఎలాంటి అంతరాయం కలగకూడదని. చలపతిరావు పార్టీల పేరుతో తరచూ త్రాగి రావడం ప్రభావతి రియాక్ట్ అవ్వకపోవడం చూసి ఆ కల్చర్‌కి మొదట్లో నివ్వెరపోయింది. ఆ సంఘటన వర్ధన్ దృష్టిలో పడకూడదని కోడలిని హెచ్చరించింది. అదే ప్రకారం ప్రభావతి అలాంటి సందర్భాలు వస్తే తండ్రి, కొడుకులిరువురూ ఎదురెదురు పడకుండా మేనేజ్ చేసుకొస్తుంది.

పట్నంలో మద్యంని మనిషికంట పడకుండా దాయటం కంటే అరిచేతిలో అగ్ని దాయటం చాలా తేలికని ఎల్లమ్మకు తెలియదు. అంతేకాదు - మారుమూల గ్రామమైన దూబగుంటలో రోశమ్మ అనే మహిళతో ఉద్యమం ప్రారంభమై ఆపై సంపూర్ణ మద్యపాన నిషేధం గురించి ఆ తరువాత జరిగిన ఎన్నో మార్పుల గురించి మరో మారుమూల గ్రామములోని ఎల్లమ్మకు ఏమాత్రము తెలియదు. మద్యం అంటే - బ్రాందీ... విస్కీ... రమ్... జిన్.. బీర్‌లా ఎన్నో తయారవుతున్నాయని అసలే తెలియదు. మద్యమంటే మందు. అది మనిషి

**(70వ పేజీ చూడండి)**